సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ఆంజనేయా.. అభయమివ్వుస్వామి..
గండి వీరాంజనేయస్వామి పుణ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. -8లో



ఆన్‌లైన్ దొంగలున్నారు
సైబర్ నేరగాళ్లు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఎప్పటికప్పుడు తమ పంథా మార్చుకుంటున్నారు. సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక ప్రజలను సులభంగా మోసగిస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.110	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 405 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	495	495
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 110.580 కిలోలు



మాచునూరు చంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో మాజీ సీఎం వైఎస్ జగన్



బాగున్నావా జేజీ అంటూ అబ్బిరెడ్డి తల్లి సుబ్బలక్షుమ్మను పలుకరిస్తూ...



మనసున్న మారాజువు అంటూ... వైఎస్ జగన్‌కు వృద్ధుల పలుకరింపు



అభిమానులతో సెల్ఫీ దిగుతూ...



వైఎస్ జగన్‌కు గొర్రెపిల్లను బహూకరిస్తున్న ఈశ్వరయ్య



యువకుడి ఉత్సాహం..

పోటెత్తిన ప్రజానీకం





పెండ్లిమర్రి మండలం గొందిపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వర్షాన్ని లెక్కచేయకుండా దారిపొడవునా వేచి ఉన్న జనం
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ఆత్రుత చూపించిన వృద్ధులు
- సెల్ఫీల కోసం ఎగబడిన గ్రామీణ యువత

సాక్షి ప్రతినిధి, కడప: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో శనివారం ప్రజానీకం పోటెత్తారు. ఉదయం నుంచి వర్షపు జల్లులు క్రమం తప్పకుండా పడుతున్నా లెక్కచేయకుండా అభిమాన నేతను చూసేందుకు ప్రజలు గంటల తరబడి రోడ్డుపై వేచి ఉన్నారు. గ్రామ గ్రామాన ప్రజలను పలకరిస్తూ, పార్టీ శ్రేణుల యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందుకు కదిలారు. మరోవైపు గ్రామీణ యువత సెల్ఫీలు తీసుకునేందుకు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. దీంతో కడప ఎయిర్‌పోర్టు నుంచి పులివెందుల చేరుకునేందుకు 9గంటల సమయం పట్టింది. ఎయిర్‌పోర్టు నుంచి బయటికి రాగానే అక్కడే వేచి ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడగానే కేరింతలు కొట్టారు. యువత సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేశారు. అక్కడి నుంచి తోళ్లగంగనపల్లెకు చేరుకున్నారు. రోడ్డుపై వేచి ఉన్న గ్రామస్తులను పలకరించి వల్లూరు చేరగా పెద్ద ఎత్తున శ్రేణులు స్వాగతం పలికాయి. భారీగా బాణా సంచా పేలుస్తూ యువత కేరింతలు కొట్టారు. తర్వాత తప్పెట్ల, వేంకటేశాపురం వద్ద వేచి ఉన్న ప్రజానీకాన్ని పలకరించి, దుగ్గాయపల్లె వీవర్స్ కాలనీ చేరుకున్నారు. నడవలేని ముదుసలి సైతం ఊతకర్ర సాయంతో వడివడిగా రోడ్డుపైకి చేరుకొని మాజీ సీఎం వైఎస్ జగన్ కోసం ఎదురుచూడడం ఆరంభించారు.

గొర్రెపిల్ల బహూకరణ: మాచునూరు నుంచి బయలుదేరిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చౌటపల్లె, ఆర్వేటిపల్లె, బుడ్డాయపల్లె, తుమ్మలూరు క్రాస్ వద్ద వేచి ఉన్న ప్రజలను పలకరించారు. నాగాయపల్లె క్రాస్ సమీపంలోకి చేరుకోగానే ఆ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య మాజీ సీఎం వైఎస్ జగన్‌కు గొర్రెపిల్లను బహూకరించారు. తర్వాత పగడాలపల్లె, ద్వారకానగర్, చెర్లోపల్లె క్రాస్ వద్ద ఉన్నవారిని పలకరిస్తూ ముందుకు కదిలారు. గుర్రాలచింతలపల్లె, బాలయ్యగారిపల్లె మీదుగా గొందిపల్లె చేరుకున్నారు. అప్పటికే గంటల తరబడి రోడ్డుపై ఉన్న మహిళలు ఆత్రుతగా ఎదురుచూడడం ఆరంభించారు.

నూతన జంటకు ఆశీర్వాదం: ఇటీవల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రహాసరెడ్డి కుమార్తె వివాహమైంది. వారి స్వగ్రామం గొందిపల్లెలో నూతన జంట ఆశా, శివారెడ్డిలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. అక్కడున్న మాచవరం కుటుంబ సభ్యులతోపాటు, బంధు మిత్రులను పేరుపేరునా పలకరించారు. తర్వాత ఇందిరానగర్, శాంతినగర్, తిప్పరాజుపల్లె, నందిమండలం, కొత్తూరు, తంగేడుపల్లె, వేంపల్లె క్రాస్ రోడ్డు ఇలా అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కమలాపురం సమన్వయకర్త నరేన్ రామాంజులరెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు



మాచునూరులో అభిమానంతో గుమికూడిన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

బాగున్నావా...జేజీ..

దుగ్గాయపల్లె గ్రామానికి చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి వచ్చి వెళ్లాల్సిందిగా ఆర్టీసీ మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి సోదరుడు శంకరరెడ్డి కోరారు. అదే రోడ్డు వెంబడి వెళ్తున్న ఆయన ఇంటికి వెళ్లి వారి తల్లి సుబ్బలక్షుమ్మను బాగున్నావా...జేజీ.. అని పలకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దపుత్తలో గ్రామమంతా రోడ్డుపైకి వచ్చి వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు. పెద్దపుత్త గ్రామం దాటగానే కమలాపురానికి చెందిన నేతలు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులంతా వేచి ఉండగా కాన్వాయ్‌ని ఆపి వారందరినీ పేరుపేరునా పలకరించారు. పైడికాల్వ క్రాస్‌లో దిగువపల్లె, ఎగువపల్లెకు చెందిన వారు వేచి ఉండడంతో వారిని పలకరించి పైడికాల్వ గ్రామం చేరుకున్నారు. గడ్డం సుబ్బారెడ్డి నేతృత్వంలో స్వాగతం పలికారు. అక్కడి నుంచి మాచునూరు దళితవాడ గుండా మాచునూరు చేరుకున్నారు. ఆ గ్రామ యువకులు కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించారు. దివంగత మాచునూరు చంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్యపడొ వద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా వర్షం

రాయచోటి: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వర్షపు జల్లులు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని 24 మండలాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. సుండుపల్లి మండల పరిధిలో 48 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో ఓ మోస్తరు మేర వర్షపాతం నమోదైంది. తంబళ్లపల్లి, వాల్మీకిపురం, పెద్ద తిప్పసముద్రం, బి.కొత్తపేట, రామసముద్రం, ములకల చెరువు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాలలో వర్షపు జల్లులు పడ్డాయి. వాగులు, వంకలు ప్రవహించకపోయినా ఎండు దశకు చేరుకున్న వేరుశనగ, నెర్రలు చీలిన వరి ఇతర పంటలకు కాస్త ఉపశమనం లభించింది.

ఇంటివద్దనే రేషన్ పంపిణీ

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లాలో ఆహార, పోషకాహార భద్రతలో భాగంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులందరికీ ఉచితంగా బలవర్ధకమైన సార్టెక్స్ బియ్యం ప్రతి నెలా రేషన్‌షాపులు, ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నుంచి సబ్సిడీ ధరలపై చక్కెర కూడా అంత్యోదయ అన్న యోజన(ఏఏవై) కార్డుదారులకు ఒక కేజీ రూ.13,50, తెల్లకార్డుదారులకు అర కేజీ రూ.17 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కొన్ని షాపుల పరిధిలో జొన్నలు, రాగులు కూడా ఉచితంగా 3 కేజీల వరకు బియ్యం బదులుగా కార్డుదారులు తీసుకొనే సౌకర్యం సెప్టెంబర్ 17వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహితం చేద్దాం

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా చేద్దామని అన్నమయ్య జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శైలజ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సందర్భంగా రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నారాయణరెడ్డిగారిపల్లె వరకు డిగ్రీ కళాశాల విద్యార్థులతో 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించి ఎయిడ్స్‌ను నిర్మూలించాలని సూచించారు. అనంతరం 5కె మారథాన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన యువకుడికి రూ.7000లు, ద్వితీయ బహుమతిగా రూ.4000లు అందజేశారు.



జేసీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఇసుక రీచ్‌లు

జేసీతో చర్చించిన ఎమ్మెల్యే ఆకేపాటి


రాజంపేట: చెయ్యేరులో ఇసుక రీచ్‌లను రాజంపేట వాసులకు అందుబాటులో కేటాయించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రను కలిసిన సందర్భంగా ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ చెయ్యేరు ఇసుక నాణ్యమైందన్నారు. అందుకే చెయ్యేరు ఇసుకకు డిమాండ్ ఉందన్నారు. ఇసుక లభ్యం కాక చాలామంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ రంగం కుప్పకూలిందన్నారు. నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటకు దగ్గరలో చెయ్యేరు నదీ పరీవాహక ప్రాంతాలైన గుండ్లూరు, మందపల్లె, శేషమాంబపురంలో ఇసుక రీచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. గతంలో కూడా ఈ ప్రాంతాల్లో రీచ్‌లు ఇచ్చారని గుర్తుచేశారు. సబ్‌కలెక్టర్ వైఖోమ్‌నైదియాదేవి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఆర్‌ఐ రాజేష్ , సబ్‌కలెక్టర్ సీసీ కిరణ్ పాల్గొన్నారు.

ఆర్.బుడుగుంటపల్లె రీచ్‌ను పరిశీలించిన జేసీ
రాజంపేట–రాయచోటి రహదారిలోని ఆర్.బుడుగుంటపల్లెలో ఏర్పాటు చేసిన రీచ్‌ను జేసీ పరిశీలించారు. డంపింగ్‌యార్డు, రీచ్‌కు అవసరమయ్యే సౌకర్యాలను పరిశీలించారు. ఇసుక రవాణాకు అనువుగా పరిస్థితులను కల్పించాలని అధికారులను ఆదేశించారు.

కూటమిలో కుమ్ములాటలు!

అన్నమయ్య జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అధికార తెలుగుదేశం, జనసేన పార్టీల్లో ప్రచ్ఛన్న యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఎవరికి వారు ఆధిపత్యం కోసం అర్రులు చాస్తున్నారు. ఫలితంగా వర్గాలుగా విడిపోయి వేర్వేరు కుంపట్లు పెట్టుకునే పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారం ఆయా పార్టీల అధిష్టానాలకు తలనొప్పిగా మారింది.

- వర్గాలుగా విడిపోయిన కూటమి నేతలు
- పదవులు, ఆదాయాల నేపథ్యంలో పార్టీల్లో అసమ్మతి జ్వాలలు
- రైల్వేకోడూరులో మూడు వర్గాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం
- తంబళ్లపల్లెలో టీడీపీ ఇన్‌చార్జిని మార్చాలని మరొక వర్గం రగడ
- రాజంపేట టీడీపీలోనూ తారా స్థాయికి చేరిన రచ్చ
- టీడీపీ, జనసేనలో కొనసాగుతున్న అంతర్యుద్ధం



సాక్షి రాయచోటి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా బలపడే వ్యవహారంలో పార్టీలో పొరపొచ్చాలు పెచ్చరిగిపోతున్నాయి. అక్రమంగా ఇసుక తరలింపునకు ఒకరు.. భూముల వ్యవహారంలో మరొకరు.. సెటిల్‌మెంట్లు చూసేందుకు ఇంకొకరు.. ఇలా ఎవరికి వారు పంచుకునే వ్యవహారాల్లో కూడా తేడాలు బెడిసికొడుతున్నాయి. తెలుగుదేశం పార్టీలో ఆర్థిక పొరపొచ్చలతోపాటు పదవుల వ్యవహారం కూడా అధిష్టానానికి తలనొప్పిగా మారుతోంది. అంతే కాకుండా నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం కూడా ఇంకా చేపట్టకపోవడంతో పలుచోట్ల ఆధిపత్యం కోసం పోటాపోటీ కార్యక్రమాలు తెరమీదికి వస్తున్నాయి. టీడీపీలో గ్రూపు రాజకీయాలు ఏకంగా పాదరక్షలతో కొట్టుకునే స్థాయికి చేరిన పరిస్థితులు జిల్లాలో చోటుచేసుకున్నాయి.

రాజంపేట టీడీపీలో రచ్చరచ్చ
అన్నమయ్య జిల్లా టీడీపీలో వర్గ విభేదాలతో తెలుగుదేశం కుదేలవుతోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పనిచేసినా తర్వాత ఆయా పార్టీల నేతల మధ్య కొన్ని నియోజకవర్గాల్లో పొసగడం లేదు. దీంతో ఎక్కడికక్కడ వేర్వేరు కుంపట్లు పెట్టుకుంటూ అవతలి వారిని దెబ్బతీసి ఆధిపత్యంలో భాగంగా మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకునేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. అయితే ఇటీవల రాజంపేట నియోజకవర్గంలో కూటమి తరుపున పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యం అక్కడక్కడా కనిపిస్తూ తన వర్గానికి మేలు జరిగేలా కృషి చేస్తున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు వర్గీయులు అన్ని కార్యక్రమాల్లో పోటాపోటీగా నిలుస్తున్నారు. ఇంకోవైపు టీడీపీ జిల్లా అధ్యక్షునిగా ఉన్న చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గం కూడా నియోజకవర్గంలో కనిపిస్తోంది. అయితే వర్గ విభేదాలు తారా స్థాయికి చేరి ఒంటిమిట్టలో నాలుగు రోజుల కిందట తెలుగు తమ్ముళ్లు పాదరక్షలతో దాడులు చేసుకున్న వ్యవహారం రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారం రేపింది.

తంబళ్లపల్లెలో ఇన్‌చార్జి వ్యవహారంపై తగవు
తెలుగుదేశం పార్టీకి సంబంధించి తంబళ్లపల్లె నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జిని నియమించాలని పార్టీ శ్రేణులు రచ్చ చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలల ముందు పార్టీలోకి వచ్చిన జయచంద్రారెడ్డికి బాబు టిక్కెట్ ఇచ్చారు. అప్పటి వరకు పార్టీని నమ్ముకుని ముందుకు పోతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌కు రిక్తహస్తం చూపారు. ఎన్నికల్లో అక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విజయం సాధించడంతో మళ్లీ టీడీపీలో ఇన్‌చార్జి గొడవ మొదలైంది. ఇప్పటికే తనకు ఇన్‌చార్జి పదవి అప్పగించాలని టీడీపీ నేత కొండ్రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇంకోవైపు తెలుగుదేశం శ్రేణులు కూడా ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనికితోడు జయచంద్రారెడ్డి, శంకర్ యాదవ్ వర్గాలు ఇన్‌చార్జి తమకంటే తమకంటూ పోటాపోటీగా పావులు కదుపుతుండడం తెలుగు తమ్ముళ్లకు ఇబ్బందికరంగా మారింది.

రైల్వేకోడూరులో ప్రచ్ఛన్న యుద్ధం

జిల్లాలోని రైల్వేకోడూరు కూటమిలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కోడూరులో జనసేన తరుపున అరవ శ్రీధర్ పోటీలో నిలబడి గెలుపొందారు. అయితే జనసేన తరుపున గెలిచినా పార్టీ వర్గాలకు దూరంగా ఉంటున్నారని జనసేన నేతలు మండిపడుతున్నారు. టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని జనసేనలో చర్చ కొనసాగుతోంది. అలాగే రైల్వేకోడూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి విశ్వనాథనాయుడు వర్గంతోపాటు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు వర్గాలు ఉన్నాయి. అయితే మూడు వర్గాలను ఎమ్మెల్యే కలుపుకుని పోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కోడూరులో వర్గాల కారణంగా రాజకీయ వైరం తారాస్థాయికి చేరి ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. అలాగే జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో కూడా పైకి కలిసికట్టుగా ఉంటున్నట్లు చెబుతున్నా లోలోపల అంతర్యుద్ధం సాగుతోంది. పదవుల పందేరం జరిగితే పార్టీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

మనసున్న కలెక్టర్

ఆర్థిక సాయం చేసిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన కోడూరు ఎమ్మెల్యే



ఆర్థిక సాయం చెక్కులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రాయచోటి: ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ముగ్గురు మహిళలకు ఆర్థిక సాయం చేసి మనసున్న కలెక్టర్‌గా అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చాటుకున్నారు. ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ ఆర్థికంగా చితికిపోయిన కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో జిల్లా కలెక్టర్ శనివారం అందజేశారు. కోడూరు నియోజకవర్గంలోని కోడూరు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి, ఓబులవారిపల్లికి చెందిన కల్పన, చిట్వేలి మండలానికి చెందిన బొంతల కుమారి కోడూరు పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు తమ సమస్యలను విన్నవించుకున్నారు. వీరి అర్జీలను జిల్లా కలెక్టర్ దృష్టికి రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ స్వయంగా తీసుకెళ్లి వివరించారు. అర్జీలపై స్పందించిన జిల్లా కలెక్టర్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ నిధుల నుంచి ఆర్థికసాయం అందించారు. కోడూరు గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి తన మనువరాలికి కాలేయం సమస్య కారణంగా ప్రతి నెల అధిక మొత్తంలో ఖర్చు వస్తోందని, ఆర్థిక సహాయం చేయాలని విన్నవించుకుంది. వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ రూ. 50 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే ఓబులవారి పల్లెకు చెందిన కల్పన తండ్రిని కోల్పోయానని ఆర్థికసాయం చేయాల్సిందిగా ఉప ముఖ్యమంత్రికి విన్నవించుకుంది. దీంతో ఆమెకు రూ. 20 వేలు ఆర్థికసాయం అందించారు. చిట్వేలి మండలానికి చెందిన బొంతల కుమారి తన కుమార్తెకు డయాబెటీస్ వ్యాధి కారణంగా ప్రతినెల అధిక మొత్తంలో ఖర్చు వస్తోందని, ఆర్థిక సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు విన్నవించుకున్నారు. వారి స్పందనలపై స్పందించిన కలెక్టర్ ఆమెకు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ చెక్కులను జిల్లా కలెక్టర్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చేతుల మీదుగా అర్జీదారులకు అందజేశారు. అర్హత కల్గిన వారికి ఆర్థిక సాయాన్ని అందించిన జిల్లా కలెక్టర్‌కు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

పీలేరురూరల్ : కారుతో సహా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. స్థానిక మదనపల్లె మార్గంలోని ఇండస్ట్రియల్ పార్క్ వద్ద పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. మదనపల్లె నుంచి పీలేరు వైపు వచ్చిన మహీంద్ర రెనాల్ట్ కారును ఆపేందుకు ప్రయత్నించగా.. డ్రైవర్ నాగరాజు కుమ్మరిపల్లె రోడ్డులో వాహనం ఆపి పరారయ్యాడు. వాహనంలో రూ.7 వేల విలువైన 23 కర్ణాటక మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని మదనపల్లెకు చెందిన బి.గణేష్‌బాబు (23), గణేష్‌కుమార్ (25, దేవేంద్ర (19)తోపాటు మరో మైనర్ బాలుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడు దుర్మరణం

మదనపల్లె : మదనపల్లె బెంగళూరు రోడ్డులోని చిప్పిలి వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ యువకుడు (35)అక్కడికక్కడే మృతి చెందాడు. నిమ్మనపల్లె మండలం చౌకిళ్లవారిపల్లెకు చెందిన శివ(30) కారుడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బెంగళూరు నుంచి మదనపల్లెకు వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో శివ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న తాలూకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

పెద్దతిప్ప సముద్రం : మండలంలోని పులికల్లు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు (27) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. పులికల్లు దళితవాడకు చెందిన గంగులప్ప కుమారుడు ఆంజనేయులు సొంత పనిపై ములకలచెరువుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంలో వస్తూ దొంగల మిట్ట సమీపంలో ఆగి ఉన్న కట్టెల ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు వెంటనే స్థలాన్ని సందర్శించారు.

తల్లి, కుమారుడు అదృశ్యం

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామానికి చెందిన నబీసాబ్‌గారి నస్రీన్, ఆమె కుమారుడు నబీసాబ్‌గారి అద్దిల్ ఆదివారం అదృశ్యమయ్యారు. గురువారం ప్రొద్దుటూరులోని తన తల్లి ఇంటికి వెళుతున్నానని చెప్పి చిన్న కుమారుడిని తీసుకెళ్లిన నస్రీన్ అనంతరం కనిపించలేదని ఆమె అత్త మహబూబ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సిద్ధయ్య తెలిపారు.

ఆన్‌లైన్ దొంగలున్నారు..



నేను ఎస్సీని మాట్లాడుతున్నాను.. మీ అబ్బాయి డ్రగ్స్‌తో పట్టుపడ్డాడు.. సెక్స్ రాకెట్ ముఠాలో మీ కుమారుడు దొరికాడు.. అంటూ ఇటీవల రాజంపేటలో ఓ ముగ్గురికి ఇదే విధంగా ఫోన్లు వచ్చాయి. ప్రొఫైల్ ఫొటో పోలీస్ ఆఫీసర్ డ్రెస్ ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలకు ఫోన్ చేయగా క్షేమంగా ఉన్నట్లు తెలుపడంతో ఫేక్ కాల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

రాజంపేట పట్టణం విద్యుత్ నగర్‌కు చెందిన సుధీర్ అనేక వ్యక్తి ఉన్న చదువులు చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అయితే రెండు సంవత్సరాల క్రితం ఇన్‌స్ట్రాగామ్‌కు వచ్చిన మెసేజ్‌కు అతను స్పందించాడు.. తన న్యూడ్‌గా ఫొటో పంపాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ సుధీర్ కనిపించ లేదు. అతడి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఇలాంటి సంఘటనలు రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల పెరిగి పోతున్నాయి. సైబర్ నేరగాళ్లు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఎప్పటికప్పుడు తమ పంథా మార్చుకుంటున్నారు. సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక ప్రజలను మోసగించి డబ్బు సంపాదించడం వారికి అలవాటుగా మారిపోయింది. పోలీసులు హెచ్చరిస్తున్నా, కొందరు ఇలాంటి వారిని నమ్మి మోసపోతూనే ఉన్నారు.

- రూటు మార్చిన సైబర్ నేరగాళ్లు
- తల్లిదండ్రులను బెదిరిస్తూ ఫోన్ కాల్స్

రాజంపేట టౌన్ : రాజంపేట నియోజకవర్గంలో తొలుత బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని ప్రజలకు ఫోన్ చేస్తున్నారు. వారి బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు నెంబర్ తెలుసుకొని వారి ద్వారా ఓటీపీ నెంబర్ చెప్పించుకుంటున్నారు. అనంతరం వారి ఖాతా నుంచి డబ్బును సైబర్ నేరగాళ్ళు డ్రా చేస్తున్నారు. ఈ విధంగా మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న తర్వాత అప్రమత్తమయ్యే వారి సంఖ్య పెరిగింది. ఈ మూడు నెలల్లోనూ దాదాపు 20 మందికి ఇలా ఫోన్లు వచ్చినట్లు తెలిసింది. ఇటీవల పోలీసుల సలహాలతో కొందరు వెనక్కు తగ్గడంతో సైబర్ నేరగాళ్ళు పంథా మార్చారు. ఫేస్‌బుక్ అకౌంట్లను హ్యాక్ చేసి ఖాతా దారుడి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లో ఉన్న వారికి ఫోన్ చేస్తున్నారు. తాను హాస్పిటల్‌లో ఉన్నానని.. అర్జెంట్‌గా డబ్బులు కావాలని మెసేజ్ పెట్టి ఫలానా బ్యాంకు ఖాతాకు నగదు జమచేయమని అడుగుతున్నారు. చాలా మంది మోసపోయి డబ్బు పోగొట్టుకుంటున్నారు.

వీడియో కాల్స్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారు

కొందరు విద్యార్థులు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ఫోన్ చేసి.. ఏదో రకంగా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు మహిళలను అడ్డు పెట్టుకొని డబ్బు సంపాదిస్తున్నారు. యువతను, సమాజంలో ఓ స్థాయిలో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని వీడియో కాల్స్ చేస్తున్నారు. కాల్ లిఫ్ట్ చేయగానే మహిళ నగ్నంగా దర్శనమిస్తుంది. వీడియోలో ఉండే మహిళ ఆసక్తిగా చూస్తూ మాటలు కలుపుతుంది. ఎవరైనా ఆకర్షితులైతే పురుషుడిని కూడా నగ్నంగా ఉండాలని కోరుతుంది. కొందరు తొందరపడి ఆ మహిళ చెప్పినట్లు చేస్తే అదంతా వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఈ విషయం బయటపడితే పరువుపోతుందని చాలా మంది బ్లాక్‌మెయిలర్లకు డబ్బులిచ్చి సమస్య పరిష్కరించుకుంటున్నారు.

అమ్మ భయపడి బోరున ఏడ్చేసింది



నా పేరు దేశబోయిన సురేస్ కుమార్. మాది రాజంపేట పట్టణం నారపురెడ్డిపల్లె. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల మా అమ్మకు ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను పోలీస్ ఆఫీసర్‌ను.. మీ అబ్బాయి గంజాయితో పట్టుపడ్డాడు.. నేను చెప్పే నెంబర్‌కు వెంటనే లక్ష రూపాయలు పంపండి.. లేకుంటే మీ అబ్బాయి జైల్లోనే ఉంటాడు. అంటూ భయపెట్టారు. ప్రొఫైల్ ఫొటో పోలీస్ డ్రెస్‌లో ఉండడతో అమ్మ భయపడి నాకు ఫోన్‌చేసింది. నేను ఫోన్ ఎత్తగానే ఏందిరా ఇలా చేశావంటూ ఏడుస్తూ విషయం చెప్పింది. డబ్బుకోసం అలా చేసి ఉంటారు.. నమ్మవద్దమ్మా.. నేను ఆఫీస్‌లో వర్క్ చేసుకుంటున్నాను అని చెప్పడంతో కుదుట పడింది. ఇదే విధంగా వివిధ ప్రాంతాల్లో ఉండే మా ఫ్రెండ్స్ తల్లిదండ్రులకు కూడా ఫోన్ కాల్స్ వచ్చాయి.

– దేశబోయిన సురేస్‌కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నారపురెడ్డిపల్లె, రాజంపేట

నిజమైన పోలీసులు అలా చేయరు



సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నిజమైన పోలీసులు ప్రజలకు ఫోన్ చేసి బెదిరించి డబ్బు అడగరు. బెదిరింపు ధోరణిలో డబ్బు అడిగినా, ఓటీపీ చెప్పండి అంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేసినా అది సైబర్ నేరగాళ్ల పనే. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా ఫోన్ చేస్తే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయండి. వాళ్ళు చేసిన ఫోన్ నెంబర్ ద్వారా నిందితులను పట్టుకొని శిక్షించేందుకు వీలవుతుంది. అలాగే న్యూడ్ వీడియో కాల్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. క్షణికావేశాలకు లోనుకావద్దు.

– కె.యల్లమరాజు, అర్బన్ సీఐ, రాజంపేట

సౌత్ జోన్ టార్గెట్‌బాల్ టోర్నమెంట్



టార్గెట్ బాల్ టోర్నమెంట్‌లో ఓ దృశ్యం

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వోన్నత పాఠశాల మైదానంలో సౌత్ జోన్ టార్గెట్ బాల్ టోర్నమెంట్ శనివారం హోరాహోరీగా సాగింది. మహిళల విభాగంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్ల మధ్య సాగిన లీగ్ కం నాక్ అవుట్ టోర్నమెంట్‌లో తమిళనాడు జట్టు గెలుపొందినట్లు ఆర్గనైజర్ చంద్రశేఖర్ తెలిపారు. పురుషుల విభాగంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగిన టోర్నమెంట్‌లోనూ తమిళనాడు గెలుపొందింది. మరో పురుషుల లీగ్ టోర్నమెంట్‌లో తమిళనాడు – పాండిచ్చేరి మధ్య సాగిన ఆటలో తమిళనాడు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాబీర్, కడప జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి అరుణమ్మ, ప్రవీణ్ కిరణ్, నిత్యప్రభాకర్, సుబ్బయ్య, బాలయ్య, వీరాంజనేయులు, రెడ్డెయ్య, నరసరాజు, ఆంజనేయులు, గోపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికకు వివాహం.. ఏడుగురి అరెస్టు



మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

గాలివీడు : బాల్య వివాహ చట్టం ఉల్లంఘన కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన మైనర్ బాలికను ఆమె తల్లిదండ్రులు, వారి బంధువుల ప్రోద్బలంతో ఆగస్టు 22న వివాహం జరిపించారు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఫిర్యాదు మేరకు బాల్య వివాహం నేర చట్టం క్రింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పెళ్లి కుమారుడు, వారి తల్లిదండ్రులు, బంధువులపై కేసు నమోదు చేసి ఆగస్ట్ 31న అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే వివాహం చేసిన వారు, సహకరించిన వారిపైనా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పింఛన్ డబ్బులు లభ్యం

ఒంటిమిట్ట : మండలంలోని పెన్నపేరూరులో పింఛన్ పంపిణీకి తీసుకెళ్లిన రూ.1.30 లక్షలు దొరికినట్లు సచివాలయం అసిస్టెంట్ శివశంకర్ తెలిపారు. శనివారం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు శివశంకర్ సుమారు రూ.1.30 లక్షల నగదు తీసుకెళ్లాడు. తీసుకువెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తన వెంట తీసుకెళ్లిన నగదు కనిపించకపోవడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆ నగదు లభ్యమైనట్లు బాధితుడు శివశంకర్ తిరిగి అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మూగ జీవిపై మమకారం



మృతి చెందిన శునకం వద్ద గొర్ల శీనా, కాంతమ్మ

కుక్క చనిపోవడంతో సంప్రదాయ రీతిలో అంతిమ సంస్కారాలు

పెద్దతిప్పసముద్రం : మనుషులనే కాదు.. మూగజీవుల పైనా కొందరు మమకారం పెంచు కుంటున్నారు. తన ఇంటి జీవిలా భావించి అది చనిపోగానే అంతిమ సంస్కారాలు చేశారు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కమ్మచెరువు పంచాయతీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు చేలూరు కాంతమ్మ, గొర్ల శ్రీనివాసులురెడ్డి దంపతులు మొరుసుపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరు ఓ కుక్కను పెంచుకుని గారాబంగా చూసుకున్నారు. అనారోగ్యంతో ఆ శునకం శనివారం మృతిచెందింది. దీంతో మానవత్వం చూపి ఆ దంపతులు శునకం మృతదేశాన్ని పాడిపై మోస్తూ.. అంతిమ సంస్కారాలు చేశారు.

ఆంజనేయా.. అభయమివ్వు స్వామీ



గండి క్షేత్రంలో స్వామి ఊరేగింపునకు హాజరైన భక్తజనం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి పుణ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వర్షంలోనూ ఆంజనేయా.. ఆదరించవయ్యా అంటూ భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే గాక, పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు కేసరి, రాజా రమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామి, వేద పారాయణం చేశారు. రామ్మోహన శర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అలంకరించారు. పల్లకిలో వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల మధ్య ఆస్థానం నిర్వహించి ఉత్సవాలు ముగించారు. భారీగా భక్తజనం రావడంతో అద్దాలమర్రి క్రాస్, ఇడుపుల పాయ క్రాస్ వద్దనే వాహనాలు నిలిపి వేశారు. దీంతో కాలినడకన భక్తులు గండికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. మరింతమంది వేంపల్లె, చక్రాయపేట, నాగల గుట్టపల్లె, వేముల, సింహాద్రిపురం, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల నుంచి వర్షంలోనూ కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దాతలు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మెన్ కావలి కృష్ణతేజ పాలకమండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, ఆర్కే వ్యాలీ, వేంపల్లె ఎస్సైలు భాస్కర్‌రెడ్డి, రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చక్రాయపేట వైద్యాధికారి వాణి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం విద్యానగర్ కాలనీకి చెందిన దస్తగిరి కుమారుడు కె.మౌలాలి(19) ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తున్నారు. కురబలకోట మండలం అంగళ్ల రైల్వే ప్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక వైపు నుంచి ఢీకొనడంతో మౌలాలి గాయపడ్డారు. చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ గట్టువారిపల్లెకు చెందిన పెద్దు(25) తన భార్య ఎర్రమ్మ(22) కుమార్తె అశ్విని(8 నెలలు)తో కలిసి ద్విచక్ర వాహనంలో చౌడేపల్లె నుంచి వస్తున్నారు. గట్టువారిపల్లె సమీపంలో కారు ఢీకొనగా ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన సిద్దులయ్య(35), తన భార్య నందు (30)తో కలిసి ఆటోలో వెళ్తున్నారు. బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దంపతులిద్దరికీ గాయాలయ్యాయి. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని

ఎర్రగుంట్ల : స్థానిక సీఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న జయశంకర్‌రెడ్డి భారతి సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న తరుణంలో రోడ్డు దాటుతుండగా, వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలయ్యాయి.

కన్వర్షన్ లేకుండా వెంచర్ వేస్తే ఎలా?



చిప్పిలి సమీపంలో అనుమతులు లేకుండా అభివృద్ధి చేస్తున్న వెంచర్



స్థలంలో రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్న సర్వేయర్, ఆర్ఐ తదితరులు

రెవెన్యూ అధికారులతో స్థానికుల వాగ్వాదం

మదనపల్లె : వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయకుండా వెంచర్ వేసి ఎలా అభివృద్ధి చేస్తారంటూ రెవెన్యూ అధికారులు రియల్టర్లను ప్రశ్నించారు. మండలంలోని బెంగళూరు రోడ్డు పొన్నూటిపాళ్యం పంచాయతీ చిప్పిలి సమీపంలోని అమూల్ డెయిరీ పక్కన కే.కే.న్యూసిటీ వెంచర్‌ను సర్వేయర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ రెడ్డెప్ప, సచివాలయ సిబ్బంది శనివారం పరిశీలించారు. వ్యవసాయ భూముల్లో ప్రహరీ నిర్మాణంతోపాటు, నెంబర్ రాయి తొలగించడం, కల్వర్టు పూడ్చి ఉండడాన్ని వారు గమనించారు. వెంచర్‌కు భూములిచ్చిన రైతుల పాసు పుస్తకాలు, సబ్ డివిజన్, ల్యాండ్ కన్వర్షన్ వివరాలివ్వాలని ఆయన కోరారు. ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేయలేదని, భూమి పత్రాలు సోమవారం అందజేస్తామని వారు సమాధానమిచ్చారు. అనుమతులు వచ్చాకే వెంచర్ వేయాలని అధికారులు సూచించారు. సొంత భూమిలో రియల్ ఎస్టేట్ వెంచర్ ప్రకటన బోర్డు, జెండాలు ఏర్పాటుచేయడం నిబంధనలకు విరుద్ధమని, వెంటనే తొలగించాలన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు, రియల్టర్ల మధ్య వాగ్వాదం జరిగింది. మా భూములు మేము అభివృద్ధి చేసుకుంటే...మీ అభ్యంతరమేంటని వారు నిలదీస్తూ దురుసుగా ప్రవర్తించడమేగాక, తహసీల్దారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కడప–బెంగళూరు జాతీయరహదారిపై బైఠాయించారు. దాదాపు 22 ఎకరాలకు పైగా వేస్తున్న వెంచర్‌లో అధికార పార్టీకి చెందిన మంత్రి, టీడీపీ రాష్ట్ర నాయకుల వాటాలు ఉన్నందునే, ప్రభుత్వ లే అవుట్ నిబంధనలు పాటించకపోగా, పరిశీలించేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను బెదిరిస్తున్నారని స్థానికులు తెలిపారు. తర్వాత వారికి వారే సర్దిచెప్పుకుని ధర్నా విరమించారు.

పరిశుద్ధ కన్యక.. మేరీమాత

కడప కల్చరల్ : తనకు జన్మనిచ్చేందుకు లోక రక్షకుడైన దేవుడు నిన్ను ఎన్నుకున్నాడని.. పవిత్రమైన మాతగా శరణు కోరిన వారికి అభయమిచ్చే ఆరోగ్య మాతగా భక్తులు ఆరాధిస్తున్నారని అన్నమయ్య జిల్లా రామాపురం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ చిన్నప్ప పేర్కొన్నారు. శనివారం మూడో రోజున ఆరోగ్య మాత ఉత్సవాలు ప్రకాశం పల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బాలసుందరం దివ్యబలి పూజ సమర్పించగా, చిన్నప్ప మరియాతల్లి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా విశ్వాసులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మేరీమాత పరిశుద్ధ కన్య అని, లోక రక్షకుడు ఏసుక్రీస్తు ఆమె ద్వారా ఉదయించేందుకు ఆమెను పవిత్రాత్మతో నింపారన్నారు. మూడో రోజు పూజా ప్రార్థన ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన మరియతల్లి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ఊరేగించారు. మరియతల్లి తేరు, దివ్య బలిపీఠం ప్రకాశంపల్లె గాయక బృందం అలంకరించింది. శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వారికి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవ ఫాదర్ ఎండీ.ప్రసాదరావు, బిషప్ సెక్రటరీ లూర్దు రాజ్, బాలశౌరి, ఫాదర్ విజయరావు, ఫాదర్ ఈరి మరియన్న, సిప్రియన్, ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తు జ్యోతి, పిల్లి మహేష్, మదర్ సెల్వి రాయపన్, ఆంథోని, సెబాస్టియన్, డేవిడ్ రాజ్, మోహన్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.